# ★ భిక్షుక ప్రియులు

శ్రీ పి. హరిప్రసాదరావు

"దానము చేసే ధర్మపరులకిల
దీనులపై దయరాదా,
దాన, ధర్మమే జ్ఞానమార్గము,
దాచిన ధనమగుగాదా॥"

పాట వినిపించేవంకతో మానవులకు కూడా అమృతదానంచేయడానికి భూలోకానికి మోహిని అవతరించిందేమోననుకున్నాను. ఆపాట వింటుంటే నిజంగా అందరూ తన్మయచిత్తులై పోవాలిసిందే.

అప్పటికి వారంరోజులనుంచీ పాటను వింటూనే వున్నాను. కాని దూరాన్నుంచి గమనించడంవలన ఎవరో సామాన్యభిక్షుకులే ననుకున్నాను, వారియందుగల విశిష్టలక్షణాలేమీ గోచరించకపోవడంచేత.

ఆమె నడివీధిలోనుంచి పంచమశృతిలో పాడుతుంది. ఆమెప్రక్కనున్న అంధయువకుడు తంబూరా మీటుతున్నాడు. అర్ధనిమీలితనేత్రాలతో, ఆ పారవశ్యాన్ని అనుభవిస్తూ ఆమె గానం చేస్తుంటే, అప్పటి ఆమె మూర్తి చాలా రమణీయంగా వుంది.

కదలడానికి వీలులేకుండా జనం చుట్టూ కమ్మేశారు. ఆమె అనేకమార్లు ముందుకు సాగడానికి ప్రయత్నం చేసింది. ఎవరూ తప్పుకోలేదు. "మీసంగతి కనిపెట్టానులే", అన్నట్టుగా చిరునవ్వుతో దయ వెల్లివిరుస్తున్న నేత్రాలతో అందరిని కలయజూచి, మరల పాడటం మొదలు పెట్టింది. అరగంట, గంట, ఎంతసేపో, ఎవరికీ తెలియలేదు. సమ్మోహితులై అందరూ, స్మృతిలేకుండా, మరోలోకంలో విహరిస్తున్నారు. ఆమె దయతలచి పాడటం అప్పటికి ఆపివేసింది. అందరూ ఒక్కమారు తలలూపి, ఎవరికితోచినది వారు, ఆమెచేతనున్న పళ్లెంలోవేసి విడిపోయినారు, మంచుతెరలవలె.

చూపు మరల్చుకునేందుకైనా, నాకు శక్తి లేకపోయింది. రెప్పవేయకుండా ఆమెవంకే చూస్తూ, అక్కడే నిలబడిపోయాను. చూచినకొలది నాకు ఆశ్చర్యంవేసింది. అన్నిఉత్తమలక్షణాలున్న ఆపిల్లకూ, ఆయువకుడికి, అలాంటిస్థితి ఎందుకు వచ్చిందా అని, వారిసంగతి పూర్తిగా తెలుసుకోవాలనిపించింది. అందరూ వెళ్లిపోయారు, నేనొక్కణ్ణే మిగిలాను.

"అమ్మా, మీతో మాట్లాడాలనివుంది. మీరు మాయింటికి రావడానికి అభ్యంతర ముందునా" అని ఆమెను అడిగాను.

ఆమె ఒక్కనిమిషం నన్ను నిదానించిచూచి "ఆలాగే పదండి" అని అన్నది.

మా మాటలు విని ఆ అంధయువకుడు "మురళీ! ఎవరువారు?" అని ఆమెను అడిగాడు.

ఆమె పళ్లెంలోని డబ్బులు గదలించుచూ, "మోహన్! ఎవరో వారు మనలను వారింటికి రమ్మంటున్నారు, వెళ్లుదమా? అని అడిగింది. అతడు "సరే ఆలాగే" అన్నాడు, నా ఆశాలతను త్రుంపకుండా.

నేను వారిని మాయింటికి తీసుకుపోయి, వారిరువురను కూర్చుండబెట్టి, కుర్రవాడితో మూడుకప్పులు 'టీ' తెప్పించుకు త్రాగాము. 'టీ' త్రాగినపిమ్మట అతడు,

"మీరెవరూ! ఎందుకు మమ్మల్నింత గౌరవిస్తున్నారు? మాతోమీకేంపని? అని నన్ను ప్రశ్నించాడు ఆయువకుడు. నేనది గ్రహించి, "అయ్యా, నేనెవరినో, ఎటువంటివాడినో, చూచి పోల్చుకునేందుకు మీకు నేత్రములు లేవు. తెలియజెప్పుకునేందు నాకు తగినంత అర్హత లేదు. మిమ్ములను చూచినప్పటినుంచీ, మీరెవరో, సామాన్యులు కారని తోచింది. మీకీస్థితి తగినది కాదని, మీ నిజవృత్తాంతము తెలిసికొనవలెనని కుతూహలం కలిగింది. నన్ను మీ సోదరునిగా భావించుకుని, మీసంగతి తెలియజేయటానికి అభ్యంతరం లేకపోతే విని ధన్యుడ నవుతాను." అని సవినయంగా అడిగాను.

అతని ముఖములో నవ్వు కన్పించింది. "మీరెవరో అమాయకులుగానున్నారు. మేమూ సామాన్య భిక్షుకులమే. మీరు భ్రాంతిపడివుంటారు" అన్నాడు.

"క్షమించండి. మీమాట విన్నతరువాతకూడా మీరు సామాన్యులనుకోవడం, అంత తగినపనిగాదు. మీవిషయమేమిటో కథగావిని, ఆనందించాలని, మిమ్ములను ఇచ్చటకు తీసుకునిరాలేదు. ఎందుచేతనోగాని,

మీతో మాట్లాడితే బాగుండు ననిపించింది. ఆ వుత్సాహమే మిమ్మల్ని ఇచ్చటకు తీసుకురావడానికి ప్రోత్సహించింది." అన్నాను.

"మీరు మమ్మల్ని చూచి జాలిపడివుంటారు."

"లేదు విచారపడ్డాను. మీకీస్థితి తగినదికాదని."

"మాకిది చాల ఆనందంగానే వున్నది."

"ఆవిషయం నేను నిర్ణయించడానికి అసక్తుణ్ని. మీకిస్థితిమాత్రం అర్థమైనదికాదు."

చాలాసేపు అతనేదో ఆలోచించాడు. చివరికి, నమ్మకం ప్రకటిస్తున్న గొంతుతో "మా జీవితం వినడానికి చాల చిత్రంగానే వుంటుంది. "మా సంగతి ఎవరికి చెప్పకూడదు, అసలు ఎవరికికావాలి" అనుకున్నాం మొదట. ఈ విషయం చెప్పటం మీకే మొదటిసారి, ఆఖరుసారికూడాను. ఇది రహస్యమని వేరే చెప్పనక్కరలేదుకదా!"

"మహాప్రసాద" మని నాలో నేను అనుకున్నాను.

"అసలు కథకుముందు మా యిద్దర్నీగూర్చి కొంచెం చెప్పాలి. నా పేరు మోహనరావు. ఈ అమ్మాయి పేరు మురళీదేవి. నేను నాయుణ్ణి, ఈమె బ్రాహ్మలు. మావూరిపేరూ, బంధువులపేర్లూ, చెప్పను. అంతా విన్నతరువాత అవి అనవసరమని మీకే తెలుస్తుంది.

"రెండేడ్లనాటి సంగతి. అప్పుడు నేను, బి. యే. చదువుతూండేవాడిని. నా జనకుడు నా చిన్ననాడే చనిపోయాడట. ఆయన చనిపోయిన నెలరోజులకు మనోవ్యథతో మా తల్లికూడా మంచంపట్టి భర్తను జేరబోయిందట. అప్పటినుండి దిక్కులేని నన్ను మా మేనమామే పెంచాడు. ఆయన చాల భాగ్యవంతుడు. మొగపిల్లలు ఎవరూలేరు. "లీల" అనే ఒక్క కూతురు మాత్రం వుంది. ఆపిల్లకు నేనంటే ఎంతో ప్రేమ. మామయ్య నన్నింత ప్రేమతో విద్యాబుద్ధులు చెప్పి పెంచడానికి కారణం, ఆ పిల్లను నాకిచ్చి పెండ్లి చేయాలనే.


# రు 750 లు బహుమానం

—: సిద్ధతాయత్తు :—

దీన్ని ధరించినవారికి దుష్టగ్రహములచే కలుగు నష్టాలు తొలగిపోతవి. బాగా డబ్బు లభిస్తుంది. పేరు ప్రఖ్యాతులను సంపాదించుతారు. మంచి ఆరోగ్యం సుపుత్రులు కలుగతవి. వ్యాపారంలో జయం; ఇదీ అదేమిటి ఏది పట్టుకున్నా బంగారమౌతుంది. ఖరీదు 2-4-0 వెంటనే ఫలితాలివ్వటానికి ప్రత్యేకతాయత్తు రూ 5-10-0.

—: వశీకరణయంత్రం :—

ఎలాంటివారినైనా లోబర్చుకోగల శక్తి నిస్తుంది. ఖరీదు 3-4-0.

వెన్వెంటనే శక్తి రావాలంటే 6-12-0 అవుతుంది ఖరీదు.

ఇది సరిగాదని ఋజువుచేసినవారికి రు 750-0-0 బహుమానం ఇవ్వబడును.

M. R. VERMAN, Post Box No. 27 (D. 937) AMRITSAR (INDIA)

మురళికూడా, బి. యే. చదువుతుండేది. మురళిని నేను ప్రేమించాను ఆమెకూడా నన్ను ప్రేమిస్తూందని ఆమె వైఖరివలన కొన్నాళ్లకు కనిపెట్టగలిగాను. మా ప్రిన్సిపలుగారు చాలా మంచివారు. తెలివితేటలు కలవారుకూడాను. ఆయన పాఠంచెప్తూంటే కుర్రవాళ్లందరూ తన్మయావస్థలో మైమరచిపోయేవారు. అందరూ అంత శ్రద్ధగా వింటూంటే, మురళిమీద పోయేది నా ఆలోచనంతా. ఇలాంటి సుందరాంగిని సౌఖ్యడోలికలలో నూగించుటకు ఎవరు నోచుకుని వున్నారోనని.

ఆనాడు ఆదివారం. కాలేజి లేకపోవుటచే సాయంత్రం షైరుకు బయలుదేరాను. సగంత్రోవలో మబ్బన్నా లేకుండానే హఠాత్తుగా వర్షంవచ్చిపడ్డది. నేను ముందరికి సాగడానికి వీలులేకపోయింది, ఆ గొప్ప వర్షంలో, అందుచేత అక్కడే ఆగిపోయి, వాన తగలని చోట నిలుచున్నాను.

ఎదురుగుండానేవుంది మురళి మేడ. మేడమీదనుంచి నన్ను చూచింది మురళి. నేను ఆమెను చూచాను. మా యిరువురి చూపులూ ఏకమైనవి. రోజూచూచే మురళి అయినా, ఆరోజున ఆమె అందం, ద్విగుణీకృతంగా కనబడ్డది. ఆమె కనబడకుండా లోపలికివెళ్లిపోయింది. అంతవరకూ తెలియకుండా పోయినచలి, రెట్టింపు ఆవేశంతో నన్ను వరించింది. ఇలా అవస్థపడుతూ అక్కడ ఎంతసేపు నిలుచున్నానో, గ్రహించుకోలేకపోయాను, క్రొత్త వుత్సాహంలో.

వీధితలుపు తెరచుకుని బయటికివచ్చి నిలబడింది మురళి. ఆమె చూపులోనే ఆహ్వానాన్ని గ్రహించి పరవశుడనై, నేను ఎక్కివచ్చిన సైకిలును నెట్టుకుంటూ, ఆమె యింటివైపు జేరుకుని, మెట్లెక్కి ఆమెవద్దకు పోయాను. 'ఈమెను పొందగలనా' అని పడుతున్న సంశయమును వదిలిపెట్టుకున్నాను ఆరోజుతో.

“లోపలికి రండ”ని చాల మర్యాదగాపిలిచింది మురళి. వెనుకముందు చూడకుండా నేను ఆమె వెంట వెళ్లాను. ఆమె తనగదిలోకి తీసుకు వెళ్ళింది. నేను తడిబట్టలు తీసివేసి, ఆమె బలవంతంగా కట్టుకోమని ఇచ్చిన పొడిబట్టలు ధరించి, సోఫామీద కూర్చున్నాను. మురళి లోనికివెళ్ళి అయిదునిమిషాలలో టీ తీసుకునివచ్చి, నాకు ఇచ్చి, తానుకూడా నా సరసను కూర్చునిత్రాగింది. నేనుకూడా టీ త్రాగటంముగించి, “నేను వెళ్ళివస్తాను, మీ ఆదరణకు చాలా అభినందనములు” అని, మనసులోవెళ్ళుటకు ఇష్టంలేకపోయినా, మర్యాదకోసం బలవంతానఅంటూ, లేచినిలుచున్నాను.

మురళి చిరునవ్వుతో, “వెళ్లడానికి వీలులేదు, మళ్లా వాన ఎక్కువవుతూంది” అన్నది. నిజంగా ముసురుపట్టింది, వాన చాల జోరుగా కురుస్తుంది. అప్పట్లో వాన వదిలేట్టు లేదు. మురళిని ఒప్పించి యింటికి జేరేటప్పటికి రాత్రి తొమ్మిదయింది.

అయిదారునెలలు గడిచాయి. అంతవరకూ మా స్నేహం ఎవరికి తెలియదు. ఆఖరికి నా ప్రాణస్నేహితులకుకూడా చెప్పలేదు. మంచో, చెడ్డో బయటపడక మానదు, ఎన్నటికైనా. ఈ సంగతి చూచాయగా తెలిసిందని గ్రహించగలిగాను. అప్పటినుంచి వారం రోజులు ఆయన కంటబడలేదు సరిగదా, మురళియింటికి కూడా వెళ్లడం మానేసాను. పాపం మురళిని క్లాసులో చూస్తుంటే, చాలా విచారంగా వుంటున్నట్టుండేది. ఆమె ఎన్నో కబురులు పంపగా, ఆఖరికి వొకనాడు మనసుపట్టలేక ఆవీధినే వెళ్లాను. మేడమీదినుంచి మురళి కనబడ్డది. నేనిక ఆలోచించకుండా లోనికి పరుగెత్తాను.

మేడమెట్లమీదనుంచి ఎగిరివచ్చి నా కౌగిలిలో వాలింది. మురళీ చాలా చిక్కిపోయింది. ఆమె నన్ను పలుకరించనూలేదు, నేను ఆమెను మాట్లాడించనూలేదు. ఆమె చాలా ఆవేదన పడుతున్నట్లు నా ఎదుటొమ్ము అంతా ఆమె కన్నీటితో తడిసిపోయిన తర్వాతగాని గ్రహించలేకపోయాను. ఇన్నిరోజులనుండి ఎందుకు రాలేదు, అని ఆమె నన్ను నిష్ఠురోక్తులేమీ ఆడలేదు. ఆనాడు రోజుకన్న ఎక్కువకులాసాగా నున్నట్లు కనపించింది. నేను ఇంటికి వెళ్లేటప్పటికి చాలా ప్రొద్దు పోయింది.

నేను భోజనంచేసి నాగదిలోకి వెళ్ళినతర్వాత, మా మామయ్య నాగదిలోకి వచ్చాడు. ఆయనను చూడటంతోటే నాకు చాలా భయమేసింది. ఆయన చాలశాంతంగా “లీలకు నీకు వివాహం స్థిరపరిచాం. అట్టే వ్యవధిలేదు. ముహూర్తం పదిరోజులలోనే వున్నది. నీ స్నేహితులనందరినీ పిలు” అన్నాడు.

ఈమాట వినగానే, నా నెత్తిమీద పెద్ద పిడుగు పడినట్లయింది. మురళిని ప్రేమించిన నాకు ఈ వివాహం ఎంతమాత్రం ఇష్టంలేదు. ఆలసించిన లాభంలేదని నేను ఆయనతో ఈ వివాహం చేసుకోనని, నిర్భయంగా చెప్పేశాను. ఆయన నాకు చాలావిధాల చెప్పిచూచాడు. కాని, లాభం లేకపోవడంవలన, చాలకోపంతో నన్ను అనేకవిధములదూషించి ఇకనుండి తనయెదటికి రావద్దని శాసించాడు నన్ను.

నేను అనేకవిధాలఆలోచించానుగాని, మురళిని మరచి లీలను పెండ్లాడుటకు నామనస్సు ఎంతమాత్రం ఒప్పుదలలోలేదు. మనస్సాక్షిగా మురళిని పెండ్లాడాను. ఈ జన్మకు ఆమెయే నాకు భార్య, ఈ హృదయంలో వేరొకతెకు స్థానంలేదు. అని నిశ్చయించుకున్నాను.

ఈ నిశ్చయం నాకెంతో ఆనందంగా వుంది. మరునాడే మురళివద్దకువెళ్ళి సంగతంతా ఆమెకు చెప్పేశాను. ఆమె విని ఊరుకున్నది. చిన్నబోయినట్లుగాకూడా కనబడ్డది. చాలారోజులవరకు మురళి అలాగేవుండేది. పరధ్యానంగా ఏదో ఆలోచిస్తున్నట్లు క్లాసులో వుంటుండేది. పాఠాలు కూడా సరిగ్గా వప్పజెప్పేదికాదు. అంత బాగా చదివే మురళి ఈవిధంగా అయిపోయిందేమా అని అందరూ ఆశ్చర్యపడేవారు. ఆమె మనసులో ఏమున్నదో నాకుకూడా తెలియనిచ్చేదికాదు. అడిగినా చెప్పదని నేనూ ఊరుకునేవాడిని. ఇలాగే చాలారోజులు గడిచిపోయినాయి.

* * *

మురళి పుట్టినరోజు. ఆరోజు మేమిద్దరం చాల సంతోషంగా గడిపాం. మధ్యాహ్నమంతా వీణ వాయించింది మురళి. సాయంకాలం ఫలహారంచేసి మురళి ప్రేమతో నోటికందిచ్చిన ఆకు వక్కలు నములుతూ, యింటికివెళ్లాను. కాని అక్కడ క్షణంసేపు వుండటం, నరక కూపంలో ఒక్క యుగమున్నట్లుగా వుంది. భోజనంచేయకుండానే వెంటనే తిరిగి వచ్చేశాను.

మురళి చక్కగా అలంకరించుకుని నారాకకెదురుచూస్తున్నది. కనుమూసి తెరచేటంతలోనే కనుమూయకుండానే రాత్రి గడిచిపోయింది. నిద్రలేచాను. అంతా చీకటిగానున్నది. చాలా చోద్యమనిపించింది. తెల్లగా తెల్లవారినతర్వాతనే నిద్రపోయానే? రోజంతా నిద్రపోయివుంటానా, ఏమో! అంత చీకటిపడినా దీపాలేమీ వెలిగించలేదు. నిప్పు పెట్టెకోసం చేత్తో వెతికా దొరికింది. గీశాను, వెలగలేదు. అది పారవేసి మరొకటి గీద్దామనుకుంటున్నాను. చేయి చుఱ్ఱుమంది, పుల్ల వెలుగుతూనే ఉందిగాబోలు. కలవరపడిపోయాను. చాల భయంవేసింది. "మురళీ" అని పిలిచాను. "లేచారా" అంటూ మురళి నావద్దకువచ్చిన సడివినపడ్డది. మురళిమాత్రం కనుపించలేదు. నిద్రమేల్కొంచేటప్పటికి అంధుణ్ణయినాను.

ఆతరువాత ఇక అతడు మాట్లాడలేకపోయాడు. జలజల భాష్పాలుకురిసినాయి. ఉద్వేగమై పొంగి పొరలివచ్చే శోకప్రవాహాన్ని అతని ధీరత్వమెంతోసేపు అరికట్టలేకపోయింది. దుఃఖమును శాంతింపచేసుకుని, తనంతట తానే ఓటువుతెచ్చుకున్నాడు. కొంచెంసేపటికి రుద్ధకంఠంతో "నాకథ నేను చెప్పాను. నీకు తెలిసిందంతా నీవు చెప్పాలి" అన్నాడు.

"ధన్యురాలనయినాను. ఏమీ అనుకోకుండా, ఎక్కడన్నా సందేహంకలిగితే అడగండి. మీకు వినిపించడం, మీరు వినడంకూడా మా అదృష్టమే కావచ్చును." అంది, ఆమె నావంక చూస్తూ "సరే" నని తలవూపాను. ఆమె చెప్పుటకు మొదలుపెట్టింది.

మా తండ్రి నా చిన్నప్పుడే చనిపోయాడు. అప్పటినుండి తండ్రినెరుగని నన్ను మా అమ్మ చాల గారాబంగా పెంచింది. నాకు చదువుయందుగల అభిలాషను కనిపెట్టి మా అమ్మ నా చదువుకు ఏమీ భంగం కలుగనియ్యలేదు. నేను ప్రతిసంవత్సరము పరీక్షలలో కృతార్థురాలనవుచుండుటచే నా చదువు విషయమై నాకు మా అమ్మ నాకన్న ఎక్కువ సంతోషపడుచుండెడిది. నేను ఇంటర్ జూనియర్ చదువుచుండగా మోహనుడుకూడా మా క్లాసులోనే ప్రవేశించాడు. అతనిని తొలిచూపులోనే వరించాను. అప్పటినుంచీకూడా చదువుకున్న మోహనునియందే నా మనస్సు లగ్నమైంది. రెండేండ్లకుపైగా జరిగిపోయింది. రానురాను ఆతడుకూడా నన్ను ప్రేమిస్తున్నట్లు కనిపెట్టగలిగాను.

ఆరోజు ఆదివారంఅవుటవలన కాలేజీలేదు. టీ త్రాగి చదువుకుందామని కూర్చున్నాను. పుస్తకం

(తరువాయి 19 వ పేజీలో)

(10 వ పేజీ తరువాయి)

చేతపట్టకముందే వర్షం ప్రారంభించింది. పదిపంక్తులు చదివేటప్పటికీ చాలాజోరుగా కురుస్తూంది. ఆ మ్రోతలో చదువుకోవటం బావుందికాదు. పుస్తకం మూసేసి కిటికీలోనుంచి బయటికిచూస్తూ నిలుచున్నాను. చువ్వలగుండా ముఖంమీదికి జల్లుకొడుతూంది. కిటికీ తలుపువేసి, ముందు వరండా తలుపు తీశాను. తీయగానే ఎదురుగుండా, చూరుక్రిందుగా, ఒదిగి తడుస్తూ, మోహనుడు నిలుచున్నాడు. అతనినిచూడగానే ఒకవిధమైన చలనం కలిగింది మనస్సులో. అతను వంచినతలఎత్తి నావంక చూచాడు. చూచేటప్పటికి పరవశనై, గబగబ క్రిందకు పరుగెత్తుకుని వచ్చేశాను.

మెట్లు దిగేటప్పటికి ముందున్న ఆవేశం తగ్గిపోయింది. చాలా సిగ్గు వేసింది. ముందుకు వెళ్లలేక నిలువబడి పోయాను. కాని కొంతసేపటికి, నేను ప్రేమించి మనసారవరించిన ఆతడు వానలో తడిసిపోతున్నాడని, స్ఫురించగానే వెనుకముందు చూడకుండా, వీధితలుపు తెరుచుకుని బయటికి వచ్చేశాను. నేను పిలువలేదు, పిలువలేకపోయాను. కాని, నా మనోగతభావాన్ని ఏలాగో గ్రహించి ఆతడే దయచేశాడు నన్ననుగ్రహించడానికి.

మాతల్లికి ఆచారంలో ఎక్కువపట్టుదల, అందువలన మోహనుడు బ్రాహ్మలనియు నాకు తెలియని పాఠములు చెప్పుటకు వస్తున్నాడనియు బొంకాను. మా అమ్మ చాల అమాయకపు మనిషి. నాయందుండు మమతవలన నేను చెప్పినమాటలు నమ్మటే కాక, మోహనుని చాలా ఆదరించేది. ఆమె నాతో అప్పుడప్పుడు, "నీకు మోహనుడివంటి భర్త లభించిన బాగుండునమ్మా" అని అంటూండేది. నేనూ, మోహనుడు మేడపైనున్నప్పుడు మా చదువుకు అభ్యంతరము కలుగునని, మా ఛాయలకే వచ్చేదికాదు. ఈవిధంగా నాలుగైదు నెలలు గడిచిపోయినాయి. ఆ రోజులన్నీ కనుమూసి తెరచేలోగా గడిచిపోయినయి.

మాతల్లి ఎట్లు గ్రహించినదో, నేను చెప్పిన మాటలన్నీ అసత్యమని, ఒకరోజు మోహనునితో స్నేహం మానేయమని, ఆ శూద్రుణ్ణి మనయింటికి రానివ్వవద్దని నాతో చాలా నిక్కచ్చిగా చెప్పింది. నాకారోజంతా అగాధసముద్రములోపడ కొట్టుకొనుచున్నట్లనిపించింది.

రోజులు నెమ్మదిగా, గడవటం మొదలుపెట్టినాయి. మాఅమ్మ ఆనాటికానాడు, మరీ కఠినంగా మాట్లాడటం సాగించింది. మోహనుని పేరు తలవకుండా, అతనిమాట మరచిపోయి ఎటులుండగలను. ఒక్కొక్కనాడు చాల భయమేసేది. మోహన్ రావడం కొంచెం ఆలస్యమయితే, ఇక రాడేమో, మా అమ్మ అతన్ని రావద్దని చెప్పిందేమో, అని చాల దిగులుగా నుండేది. అతను రాకపోతే, ఎవరికోసం ఎందుకు బ్రతకడం?

నా పుట్టినరోజు నాలుగురోజు లుందనగానే, మాఅమ్మ నన్ను నిష్టురోక్తులాడటం మానేసింది. ఆవేళ నన్ను విడిచివెళ్లనేలేదు. మాఅమ్మవారినికూడా చాల గౌరవించింది. చాలసంతోషంగా గడిపాం ఆరోజు.

అంతే ఆ పాపిష్టివేళ ఆవేళతో మోహనుకు సూర్యచంద్రులు లేకుండా బోయాయి. నేను చాల కలవరపడిపోయాను. కాని ఒంటరిదాన్ని ఏమిచేయగలను. నేనుకూడా అధైర్యపడితే మోహనుడు మరీ క్రుంగిపోతాడని, నేను కుమిలిపోతూ, అతనికి ధైర్యం చెబుతూ కూర్చున్నాను. వారి మేనమామకు కబురు పంపినాను. ఆయనవచ్చి మోహనుని తీసుకువెళ్ళి చికిత్స చేయిస్తాడుగదా అని సంతసించాను. కాని విధి ప్రతికూలుడైనాడు. "చేసుకున్నంతా అనుభవించక తప్పదని" ఆయన కబురుపంపాడు. వచ్చి చూడనన్నా లేదు ఆఖరికి.

మోహనుడు ఎవరికీ తనసంగతి తెలియనీయవద్దన్నాడు. కాని, దాగుతుందా, అతని స్నేహితులందరూ వచ్చారు. చాలా దుఃఖించారు. మోహనుడు అధైర్యపడనే లేదు. అందరికీ చాలా వింతగావుంది, రాత్రి చక్కగా నిద్రపోయినవాడు, మేల్కొంచేటప్పటికి దృష్టిలేకుండాబోవటం, చాలా చిత్రమనిపించింది.

నాలుగురోజులు, నాలుగు సంవత్సరాలకన్న మందగతితో గడిచాయి. వైద్యుడు ప్రతిరోజువచ్చి చూచి, ఏదో మందు ఇచ్చిపోతున్నాడు. కాని, ముఖలక్షణాలు చూస్తే ఆయనకు రోగం అంతు చిక్కలేదని తేలిపోయింది.

"ఇచ్చట శూద్ర వెధవ లుండుటకు వీలులేదు. ఆతనిని మనయింట్లోనుంచి వెళ్లిపొమ్మను" అని నన్ను ఆగ్రహంతో ఆజ్ఞాపించింది మా అమ్మ. నేను కాళ్ల

మీదపడి బ్రతిమాలుకున్నాను. ఆమె ఒల్ల కాదన్నది. నేను ఒళ్లుమరచిపోయి తిరగబడినాను. అతనితోపాటు నేనూ వెళ్లిపోతానన్నాను. ఇంకా ఏమేమో చాలా కేకలువేస్తూ అన్నాను. ఆమె నాకన్న ఎక్కువగా కేకలువేసింది. 'మీరు ఎంత త్వరగాపోతే అంత మంచిది. తక్షణం పొండి. నీవంటి కులభ్రష్టురాలు నాకసలు అక్కరలేదు' అన్నది.

ఆమె నన్ను తూలనాడుతూ, ఆ ఆవేశంలో తాను చేసిన ఆ ఘన కార్యాన్ని బయట పెట్టింది. మోహనునకు, మా అమ్మ మనసు విరవాలని పెట్టిన మందు వలన, ఆతనికి కళ్లులేకుండాబోయినాయి. మోహనుని, మేనమామే, దీనంతటికీ కారకుడని తరువాత తెలిసింది. మా స్నేహమును, మా అమ్మకు, ఆతడే వెల్లడించి, మాటల చేతగాదని మందుల లోకి దిగి, ఇంత పనిచేశాడు, తనకుమార్తెను మోహనునకిచ్చి పెండ్లి చేయాలనే తలంపుతో.

ఎవరితోనూ చప్పలేదు. ఎక్కడికి వెళ్లామో, ఎవరికీ తెలియదు. ఇద్దరమూ బయలుదేరాము. తీర్థయాత్రలన్నీ సేవించుకుని, తిరిగి వెళ్లిపోతున్నాం, యింటికి. ఇక నెల్లాళ్లలో చేరుకుంటాం. మా పుణ్యం మంచిది. మహానుభావుడొకడు తటస్థించి మోహనుకు తగిన చికిత్సచేసాడు. మావూరు వెళ్లేప్పటికి మోహనుడు, మళ్లా కులాసాగా ఉంటాడు. ఆ చక్కని కళ్లతో నను.........

మాట పూర్తిచేయలేకపోయింది. అప్పటిసంతోషాన్ని తలచుకుంటూ.

కథ చాలించింది. అందరమూ కొంచెంసేపు మాటాడకుండా కూర్చున్నాం. నేను చాలా సంతసించి, వారితో "నాదొక మనవివుంది" అన్నాను.

"తమరలా అనరాదు. ఆజ్ఞాపించండి" అన్నాడతడు.

"అన్యధాభావించక, తాము స్వస్థతజెందే వరకూ, ఈ సోదరుడి ఆధిత్యాన్ని స్వీకరించమని ప్రార్థన."

"తమదయకు సంతోషం. కాని, క్షమించండి. మాకు నియమంవుంది. అందుచేత మీమాటకు కాదనవలసివస్తుంది. ఉదయం ఇక్కణ్ణుంచి వెళ్ళిపోతాం"

"అది నా దురదృష్టం"

"మీరు వేరేలాగ అనుకోవద్దు. మిమ్ములను మా ఆప్తకోటిలోనివారిని గాభావించుకున్నాము. మాటల ధోరణిలో మరచిపోయాను. మీ చిరునామా ఇప్పించండి. ఉత్తరం వ్రాస్తాను. అప్పుడు మీరు తప్పకుండా వచ్చి మమ్మల్ని చూచిపోవాలి."

"ఓ, అవశ్యం, అలాగే"

"మాదీక్ష చెల్లినతరువాత, మురళిని నేను యథావిధిగా వివాహ.........మురళి అతన్ని వారించింది. అతడు చిరునవ్వు నవ్వాడు.

ఆ భిక్షుకప్రియు లిరువురూ నా ఆశీర్వాదమును పొంది, వెడలిపోయారు.


## చేతిపనుల
## వర్తక రహస్య బోధిని

సబ్బులు, సెంటులు, పరిమళతైలములు, బాణసంచ, అత్తరు, పన్నీరు, పిప్పరమెంటు, మందులు మొదలగునవి సులభముగా తయారుచేయు పరిశ్రమలు 500 గలవు. ధర 1 రూపాయి, పోస్టుఖర్చులు 5 అణాలు.

### కొక్కోకము

స్త్రీ పురుష రహస్యములు 64 చిత్రపటములతో 302 పేజీలుగల పెద్ద పుస్తకము. ధర రు 1-0-0. పోస్టుఖర్చు రు. 0-5-0 లు. ఇందులో స్త్రీ పురుష శృంగార రహస్యములు, శయ్యాగృహ మర్మములు గలవు.

### దాంపత్య మర్మములు

పడకటి ముచ్చటలు, రతి సంబంధమయిన అనేక మర్మవిషయము లిందు గలవు. 9 పటములలో 102 పేజీలుగల పెద్దపుస్తకము. ధర రు. 0-8-0. పోస్టుఖర్చులు 0-5-0. కొక్కోకము, దాంపత్యమర్మములు ఒకేదఫా రెండుకొనిన పోస్టుఖర్చులతో రు. 1-12-0.

మహారాజ పుస్తకశాల

అరుణాచలమొదలి వీధి, 18 టీటు, మద్రాసు.